http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శుక్రవారం 26 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## యువతకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలి

- ధర్మేంద్ర ప్రధాన్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- కేంద్ర ప్రభుత్వ తీరుపై రాహుల్ గాంధీ మండిపాటు
- ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి బదులుగా విమర్శిస్తోందని ఆరోపణ
- విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎప్పటికీ గళం విప్పుతూనే ఉంటానన్న ప్రతిపక్షనేత

# నేను గుంపు మేస్త్రీనే ఈ గుంపంతా నాదే



- ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- 16 బ్యాంకులతో ప్రమాద బీమా ఒప్పందాలు
- తాను గుంపుమేస్త్రీనేనని, అలా చాలామంది అవహేళన చేశారని రేవంత్ వెల్లడి
- ఉద్యోగులకు ప్రమాద బీమాను మొదట సింగరేణిలో ప్రారంభించాం
- సింగరేణిలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే రూ.కోటి చొప్పున చెక్కులు అందజేశాం

హైదరాబాద్

ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపడంలో కృషి చేస్తున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్?లోని రవీంద్ర భారతిలో ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రేవంత్ రెడ్డి సమక్షంలో 16 బ్యాంకులతో - మిగతా3లో



## మీరు ఇవ్వరు విద్యార్థుల నుంచి వసూలు చేసుకోనివ్వరా

- హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట
- ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే
- వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్

తెలంగాణ హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవద్దని - మిగతా3లో



## అంతర్జాతీయ విమానాల్లో 'హబ్ అండ్ స్పోక్' మోడల్

- ప్రపంచ అవకాశాలకు భారత్ మరింత చేరువ : మోదీ
- వారణాసి నుంచి తొలి 'హబ్ అండ్ స్పోక్' విమాన సేవలకు శ్రీకారం
- ఆరు వారాల్లో మరో ఆరు నగరాలకు సేవల విస్తరణ
- వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులకు కొత్త అవకాశాలు వస్తాయన్న ప్రధాని

## పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదు

- వివాదం వేళ కేంద్రం క్లారిటీ
- పాస్‌పోర్ట్ ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, దాన్ని పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేమన్న ఎంఈఏ అధికారి
- ఈ వ్యాఖ్యలపై భగ్గుమన్న విపక్ష నేతలు.. తాజాగా వివరణ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం




## కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



- గ్రామీణ, మండల స్థాయి జర్నలిస్టులకు కనీస గౌరవం కూడా లేదన్న కేటీఆర్
- జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్
- ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ, మండల స్థాయి జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి కనీస గుర్తింపు, గౌరవం లేకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల హెల్త్ కార్డ్స్, ఇళ్ల స్థలాలు, అర్హులైన విలేకరులందరికీ కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని - మిగతా3లో



## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం

- దూరం నుంచే దెబ్బ
- చైనాను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలు రూపొందిస్తున్న భారత్
- దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- భారత్ వద్ద 24 అగ్ని-5 క్షిపణులు ఉన్నట్లు SIPRI అంచనా
- అగ్ని-5 పరిధి సుమారు 5,000 కిలోమీటర్లు
- దేశీయ రక్షణ ఉత్పత్తి రూ.1.78 లక్షల కోట్లకు పెరుగుదల
- డ్రోన్లు, సైబర్ యుద్ధ సామర్థ్యాలపై భారత్ ఫోకస్

## వెనిజులాలో భూకంప విలయం..

- 164 మంది మృతి.. 971 మందికి పైగా గాయాలు
- 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు
- లా గ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం
- అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు
- ప్రధాన విమానాశ్రయం, మెట్రో సేవలకు అంతరాయం
- పలు దేశాల నుంచి సహాయక బృందాల రాక



# మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ

- తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం
- తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభం
- చరిత్రలో నిలిచే ఘట్టమన్న రేవంత్
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనమని స్పష్టీకరణ
- జల వివాదాలకు పరిష్కారం కావాలని ఆకాంక్ష
- కృష్ణా-గోదావరి సమస్యల పరిష్కారమవుతాయని ఆశాభావం
- రాజోలిబండకు కేటాయించిన 15 టీఎంసీల్లో మేం నాలుగైదు టీఎంసీలే వాడుకుంటున్నాం



హైదరాబాద్

తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోందని చెప్పారు. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తుంగభద్ర తీరుస్తుందన్న ఆయన తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత అని అన్నారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలకు - మిగతా3లో



## రష్యాకు భారత పెట్రోల్..

- ఉక్రెయిన్ దాడుల ప్రభావం!
- ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో దెబ్బతిన్న రష్యా రిఫైనరీలు
- భారత్ నుంచి పెట్రోల్ దిగుమతులకు రష్యా ప్రణాళిక
- దిగుమతి కంపెనీలకు సబ్సిడీల ప్రతిపాదన
- జూన్ 2026లో భారత్ రష్యా చమురు కొనుగోలు రికార్డు స్థాయికి
- రష్యాలో రోజుకు 25 వేల టన్నుల పెట్రోల్ కొరత
- ఇంధన ధరలు భారీగా పెరుగుతున్న పరిస్థితి

# యువతకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలి

కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా పదేపదే ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నాయని, విద్యా వ్యవస్థలోని లోపాల కారణంగా కోట్లాది మంది యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. తమ హక్కులు, నిష్పక్షపాత పరీక్షలు కోసం గళం విప్పుతున్న విద్యార్థులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని మండిపడ్డారు. అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి, బదులుగా వారినే విమర్శిస్తోందని అన్నారు. సురక్షితమైన భవిష్యత్తు కోసం నిరసనలు తెలుపుతున్న విద్యార్థులను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదులు'గా ముద్ర వేసే స్థాయికి వెళ్లడం బాధాకరమన్నారు. అయితే, తమ భవిష్యత్తు కోసం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకుగానూ, దేశ యువతకు వెంటనే క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. "ఎవరి వైఫల్యాల వల్ల ఇన్ని పేపర్ లీక్‌లు జరిగాయో, ఎవరి హయాంలో 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారో, లక్షలాది మంది యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందో ఆలోచించండి. అలాంటి వారే ఇప్పుడు బాధిత విద్యార్థులను, వారి తరఫున మాట్లాడుతున్న వారిని 'ఉగ్రవాదులు' అని ముద్ర వేస్తున్నారు. విద్యార్థులను అవమానించినందుకు గానూ దేశంలోని కోట్లాది మంది యువతకు వెంటనే క్షమాపణ చెప్పాలి. అలాగే, విద్యా వ్యవస్థలో జరిగిన వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి. నన్ను ఎంత విమర్శించినా నేను పట్టించుకోను. కానీ ప్రతి విద్యార్థికి అందుబాటు ధరలో నాణ్యమైన విద్య, నిష్పక్షపాత పరీక్షలు అందే వరకు నా పోరాటం కొనసాగుతుంది."




### 'ప్రశ్నించిన వారు దేశద్రోహులు'

అయితే, ఇలా జరగడం ఇదేమీ మొదటి సారి కాదని రాహుల్? గాంధీ అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను, గతంలో 'పరాన్నజీవులు'గా పిలిచారని చెప్పారు. అంతే కాకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని 'దేశద్రోహులు'గా ముద్రవేశారని పేర్కొన్నారు. ఇప్పుడు యువతను కూడా అదే విధంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై ముద్రలు వేయడమే బీజేపీ ప్రభుత్వానికి అలవాటేనని ఆరోపించారు. అలాగే విద్యా వ్యవస్థ ప్రస్తుతం దోపిడీ దందాగా మారిందని ఆయన ఆరోపించారు.

### స్పందించిన సీజేపీ

ఇదిలా ఉండగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా తీవ్రంగా స్పందించారు. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్' వేదికగా పంచుకున్న ఆయన, విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తున్న వారిపై ఇలాంటి ఆరోపణలు చేయడం బాధ్యతాయుతమైన వైఖరి కాదని విమర్శించారు. "బలవన్మరణాలకు పాల్పడిన విద్యార్థులకు న్యాయం చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అలాంటి సమయంలో సీజేపీని 'ఉగ్రవాదుల బి-టీమ్'గా అభివర్ణిస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలకు మద్దతు ఇస్తున్న వారిని లక్ష్యంగా చేసుకోవడం సరికాదు. విద్యార్థుల సమస్యలను వినాల్సిన విద్యాశాఖ మంత్రి, వారిపై విమర్శలు చేయడం బాధాకరం." కాగా, తన రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలను 'విద్రోహ శక్తుల బి-టీమ్'గా ధర్మేంద్ర ప్రధాన్? అభివర్ణించారు. అనంతరం, ఈ వివాదం తలెత్తింది. "ప్రజాస్వామ్యంలో తిరస్కరణకు గురైన వారు మారువేషంలో వచ్చి ఇప్పుడు వ్యవస్థపై పగబట్టారు. దేశాన్ని విభజించాలనుకునే వారి కోసం వీరు నినాదాలు చేస్తున్నారు" అని ధర్మేంద్ర వ్యాఖ్యానించారు.

# అంతర్జాతీయ విమానాల్లో 'హబ్ అండ్ స్పోక్' మోడల్

దేశాన్ని ప్రపంచ విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రారంభించిన 'హబ్ అండ్ స్పోక్' మోడల్ సేవలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ మోడల్ కింద తొలి విమాన సేవలను గురువారం ఉత్తర్?ప్రదేశ్?లోని వారణాసి నుంచి ప్రారంభించారు. వచ్చే ఆరు వారాల్లో మరో ఆరు భారతీయ నగరాలకు విమాన సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, 'హబ్ అండ్ స్పోక్' మోడల్ దేశంలోని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు మరింత చేరువ చేస్తుందని అన్నారు. ఈ విధానం వల్ల ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, చిన్న నగరాలకు కూడా ప్రపంచ స్థాయి అనుసంధానం లభిస్తుందని పేర్కొన్నారు.

### 'విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది'

ఈ మోడల్ వల్ల ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. విమానాల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు, ప్రధాన విమానాశ్రయాలపై ఉన్న రద్దీ కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యంత ముఖ్యంగా, దేశంలోని మరిన్ని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు దగ్గర చేస్తుందని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ కొత్త మోడల్ కింద తొలి సేవలు ప్రారంభమైన వారణాసికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన జీవన నగరాల్లో ఒకటైన వారణాసి భారతీయ నాగరికతకు ప్రతీక అని పేర్కొన్నారు. అభివృద్ధి, వారసత్వం రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగాలన్న తమ దృక్పథానికి వారణాసి ప్రతిబింబమని చెప్పారు. మెరుగైన విమాన అనుసంధానం ద్వారా ఈ నగరం ప్రపంచంతో మరింత బలమైన సంబంధాలను ఏర్పరుచుకుంటూనే తన ప్రత్యేకతను కాపాడుకుంటుందని పేర్కొన్నారు.



### 'ఈజీ కనెక్ట్' పేరుతో తొలి సేవలు

ఎయిర్?ఇండియా 'ఈజీ కనెక్ట్' పేరుతో ఈ ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విమానం ఏఐ1111 ఉదయం 9.30 గంటలకు వారణాసి నుంచి బయలుదేరింది. ఈ విమానం ద్వారా దిల్లీకి చేరుకున్న ప్రయాణికులు అక్కడి నుంచి దుబాయ్, కొలంబో, జెడ్డా, రియాద్, ఫుకెట్ సహా తొమ్మిది అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణించే అవకాశం కల్పించారు. ఈ మోడల్ ద్వారా చిన్న నగరాల నుంచి వచ్చే ప్రయాణికులు ముందుగా దిల్లీ వంటి ప్రధాన హబ్ విమానాశ్రయాలకు చేరుకుని, అక్కడి నుంచి విదేశీ గమ్యస్థానాలకు సులభంగా వెళ్లగలుగుతారు.

### ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు

'ఈజీ కనెక్ట్' మోడల్‌లో ప్రయాణికులు తమ ప్రయాణం ప్రారంభమైన నగరంలోనే బ్యాగేజీ (లగేజీ) చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో మధ్యలో హబ్ విమానాశ్రయాల్లో తిరిగి ఈ ప్రక్రియలను నిర్వహించాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభవం లభిస్తుందని అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభవం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

### మరిన్ని నగరాలకు విస్తరణ

రానున్న నెలల్లో అమృత్‌సర్, అహ్మదాబాద్, కొచ్చి, గోవా, హైదరాబాద్, చెన్నై నగరాలకు కూడా 'ఈజీ కనెక్ట్' సేవలను విస్తరించనున్నట్లు ఎయిర్?లైన్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్?బెల్ విల్సన్? తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రధాన హబ్ నగరాల వెలుపల ఉన్న ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రయాణం మరింత సులభం కానుంది. ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటి. ఈ నేపథ్యంలో చిన్న నగరాలను అంతర్జాతీయ గమ్యస్థానాలతో అనుసంధానం చేయడం ద్వారా దేశాన్ని ప్రపంచ విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### చిన్న నగరాల అభివృద్ధికి దోహదం

పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ, ఈ మోడల్ రెండో, మూడో శ్రేణి నగరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. మెరుగైన అంతర్జాతీయ అనుసంధానం వల్ల కొత్త పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. వాణిజ్యం, పర్యాటకం, విద్య, వైద్య రంగాలకు కూడా ఈ మోడల్ ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదు

పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను ప్రూఫ్‌గా పరిగణించే ఏ నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. దేశ పౌరులు కాని వారికి పాస్‌పోర్ట్‌లు జారీ చేసే వెసులుబాటు పాస్‌పోర్ట్స్ చట్టం-1967లో ఉందని వెల్లడించింది. అలాగే పాస్‌పోర్ట్ కలిగి ఉండటం పౌరసత్వాన్ని నిర్ధరించదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులు స్పష్టం చేశాయని తెలిపింది. ఈ మేరకు కేంద్ర సర్కార్ ప్రకటన విడుదల చేసింది. భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, దానిని పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించరాదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సీనియర్ అధికారి ఒకరు బుధవారం వ్యాఖ్యానించారు. పత్రాలను విస్తృతంగా ధ్రువీకరించి, పరిశీలించిన తర్వాతే పాస్‌పోర్ట్ జారీ చేస్తారని, అయితే దాని ప్రాథమిక ఉద్దేశ్యం అంతర్జాతీయ ప్రయాణాన్ని సులభతరం చేయడం, విదేశాల్లో పాస్‌పోర్ట్ హోల్డర్ జాతీయతను నిర్ధరించడమని పేర్కొన్నారు. జూన్ 24న 14వ పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా ఎంఈఏ అధికారి ఈ మేరకు మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేమన్న విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటనపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ మండిపడ్డారు. అలాంటప్పుడు ఏ పత్రం పౌరసత్వానికి రుజువుగా నిలుస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. " భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ జూన్ 24న పాస్‌పోర్ట్ ఒక ప్రయాణ పత్రం మాత్రమే, పౌరసత్వానికి ప్రూఫ్ కాదని చెబుతోంది. అలాంటప్పుడు ఏ పత్రం పౌరసత్వానికి అసలైన ప్రూఫ్? బీఎల్ఓ నా పౌరసత్వాన్ని అనుమానించవచ్చు. నా ఓటును నాకు దూరం చేయవచ్చు. ఫలితంగా ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుంది" అని ఎక్స్‌లో కపిల్ సిబల్ పోస్ట్ పెట్టారు.

### న్యాయస్థానాలు ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పాయ్ : బీజేపీ నేత మాలవీయ

మరోవైపు ఈ వివాదంపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందించారు. పాస్‌పోర్ట్‌ల విషయంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ కొత్త విధానాన్ని ప్రకటించలేదని స్పష్టం చేశారు. అంతకుముందు నుంచి ఉన్న చట్టపరమైన స్థితిని పునరుద్ఘాటించిందని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి నిర్ణయాత్మకమైన రుజువు కాదని భారతీయ న్యాయస్థానాలు పదేపదే తీర్పులిచ్చాయని, 2013 బాంబే హైకోర్టు తీర్పును పరిశీలించాలని కోరారు. దేశంలో జనన ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల పౌరసత్వ రికార్డులు, పాఠశాల రికార్డులు, ఓటర్ల జాబితా వివరాలు, ప్రభుత్వ సేవా రికార్డులు, భూమి, నివాస రికార్డులు సహా అనేక రికార్డుల కలయిక ద్వారా పౌరసత్వం నిర్ధారణ అవుతుందన్నారు. "1967 పాస్‌పోర్ట్ చట్టం ప్రకారం నిర్దిష్ట పరిస్థితుల్లో పౌరుడు కాని వారికి కూడా పాస్‌పోర్ట్ జారీ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. అందువల్ల పాస్‌పోర్ట్ కలిగి ఉండటాన్ని పౌరసత్వానికి నిర్ణయాత్మకమైన రుజువుగా పరిగణించలేమని చట్టంలో ఉంది. ఈ వ్యత్యాసం వివాదాస్పదమైనది కాదు. పాస్‌పోర్ట్ ఒక ముఖ్యమైన గుర్తింపు, ప్రయాణ పత్రం. కానీ పౌరసత్వం అనేది రాజ్యాంగం, పౌరసత్వ చట్టం నుంచి వస్తుంది తప్ప, ప్రభుత్వం జారీ చేసిన ఏదో ఒక పత్రాన్ని కలిగి ఉండటం నుంచి రాదు" అని అమిత్ మాలవీయ స్పష్టం చేశారు.

### కేంద్రంపై ఆదిత్య ఠాక్రే ఫైర్

అలాగే పాస్‌పోర్ట్ వివాదంపై శివసేన (యూబీటీ) నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే స్పందించారు. పోలీసుల ధ్రువీకరణ, విస్తృతమైన తనిఖీల తర్వాత మాత్రమే పాస్‌పోర్ట్‌లు జారీ చేస్తారని తెలిపారు. అయితే విదేశాంగ శాఖ బుధవారం చేసిన ప్రకటన అంతర్జాతీయంగా భారతీయ పాస్‌పోర్ట్‌ల హోదాపై గందరగోళాన్ని సృష్టించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే చాలా గందరగోళంగా ఉన్న భారత విదేశాంగ విధానాన్ని మించి, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకెంత అసంబద్ధంగా మారగలదు? అని ఎద్దేవా చేశారు.

### ఇది చాలా విడ్డూరంగా ఉంది : జావేద్ అక్తర్

మరోవైపు ఈ వివాదంపై ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ కీలక వ్యాఖ్యలు చేశారు. "పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి రుజువు కాదని విదేశీ వ్యవహారాల శాఖ చెబుతోంది. నిజంగానా? అంటే, ఒక వ్యక్తి భారతీయ పౌరుడేనని పూర్తిగా నిర్ధారించుకోకుండానే ఈ ప్రయాణ పత్రాన్ని జారీ చేస్తున్నారా? ఇది చాలా విడ్డూరంగా ఉంది" అని జావేద్ అక్తర్ పేర్కొన్నారు.

## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం..



భారత సైనిక ఆధునికీకరణ కొత్త దశకు చేరుకుంటోంది. ఒకప్పుడు ప్రధానంగా పాకిస్థాన్‌ను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలను రూపొందించిన భారత్.. ఇప్పుడు చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లపై మరింత దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణులు, అధునాతన ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. అంతర్జాతీయ పరిశోధనా సంస్థ SIPRI తాజా నివేదిక ప్రకారం.. చైనా సైనిక శక్తి పెరుగుతుండటం, పాక్‌తో దాని వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడటం భారత్ రక్షణ ప్రణాళికలపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లోని లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యాలను భారత్ వేగంగా పెంచుకుంటోంది. గతంలో సుమారు 2,000 కిలోమీటర్ల పరిధి ఉన్న అణ్వాయుధ సామర్థ్య క్షిపణులకే పరిమితమైంది. ఇప్పుడు 3,000 కిలోమీటర్లకు పైగా ప్రయాణించే క్షిపణులను సైన్యంలోకి తీసుకొస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 24 అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ క్షిపణి సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగలదని అంచనా. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, సైబర్ దాడులు, కచ్చితమైన లక్ష్యఛేదన సామర్థ్యాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ స్వదేశీ రక్షణ తయారీపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2014-15లో రూ.46,400 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ.. 2024-25 నాటికి రూ.1.78 లక్షల కోట్లకు చేరుకుంది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయిలో రూ.38,400 కోట్లకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు భారత్‌కు కొత్త పాఠాలు నేర్పాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో అధునాతన డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ఆధారిత రక్షణ భాగస్వామ్యాలపై కేంద్రం మరింత దృష్టి పెడుతున్నట్లు నివేదిక పేర్కొంది.

## వెనిజులాలో భూకంప విలయం..



వరుస భూకంపాల ధాటికి వెనిజులాలో ఇప్పటి వరకు 164 మంది చనిపోయినట్లు గుర్తించారు. మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత వందేళ్లలో ఆ దేశాన్ని తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇవి ఒకటిగా నమోదయ్యాయి. రాజధాని కారకాస్‌తో పాటు పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సంభవించింది. ముఖ్యంగా లా గ్వైరా ప్రాంతం అత్యంత ప్రభావితమైంది. డజన్ల కొద్దీ భవనాలు నేలమట్టమవగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. రాష్ట్ర టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల్లో శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఘటన కనిపించింది. భూకంపాల సమయంలో కారకాస్‌లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. పలుచోట్ల విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నష్టం వాటిల్లడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెట్రో సేవలను నిలిపివేయగా, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అమెరికా భూకంప పరిశోధనా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన ఉన్న మోరాన్ సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే మరో భారీ భూకంపం నమోదైంది. ఈ ప్రకంపనలు బ్రెజిల్, కొలంబియా వరకు అనిపించాయి. విపత్తు తీవ్రత దృష్ట్యా అమెరికా, మెక్సికో, ఖతార్, ఎల్‌సాల్వడార్ సహా పలు దేశాలు సహాయక బృందాలు, వైద్య సాయం పంపుతున్నాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

## రష్యాకు భారత పెట్రోల్..



ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో చమురు శుద్ధి కేంద్రాలు దెబ్బతినడంతో రష్యాలో పెట్రోల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారత్ నుంచి పెద్ద ఎత్తున పెట్రోల్ దిగుమతి చేసుకునే దిశగా రష్యా అడుగులు వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌కు చెందిన కీవ్ పోస్ట్ కథనం ప్రకారం.. భారత్ నుంచి సముద్ర మార్గంలో పెట్రోల్ దిగుమతులను ప్రోత్సహించేందుకు రష్యా తన పన్ను చట్టాల్లో మార్పులు చేయాలని భావిస్తోంది. భారత్ నుంచి పెట్రోల్ దిగుమతి చేసే కంపెనీలకు సబ్సిడీలు అందించే ప్రతిపాదనకు రష్యా పార్లమెంట్ బడ్జెట్ కమిటీ మద్దతు తెలిపినట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ముడి చమురుకు భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా మారింది. ప్రస్తుతం రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. 2026 జూన్‌లో ఈ దిగుమతులు రోజుకు 26.6 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరినట్లు నివేదిక పేర్కొంది. భారత్‌లోని రిఫైనరీల్లో శుద్ధి చేసిన చమురులో కొంత భాగాన్ని పెట్రోల్, ఇతర ఇంధన ఉత్పత్తుల రూపంలో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2025లో భారత్ పెట్రోల్ ఎగుమతులు రోజుకు 4 లక్షల బ్యారెళ్ల రికార్డు స్థాయికి చేరాయి. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యా చమురు శుద్ధి సామర్థ్యం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు సుమారు 85 వేల టన్నుల పెట్రోల్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. వేసవి కాలంలో డిమాండ్ 1.11 లక్షల టన్నుల వరకు ఉంది. దీంతో రోజుకు దాదాపు 25 వేల టన్నుల కొరత ఏర్పడినట్లు నివేదిక వెల్లడించింది. పెట్రోల్ కొరత కారణంగా రష్యాలో ఇంధన ధరలు పెరుగుతున్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు తేలికపాటి విమానాల నిర్వాహకులు విమాన ఇంధనానికి బదులుగా ఆటోమొబైల్ పెట్రోల్‌ను వినియోగించాల్సి వస్తోందని సమాచారం

# మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ

-మొదటిపేజీ తరువాయి

పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోతే అవి నేరుగా వల్ల సముద్రంలో కలుస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాల సమస్యకు పరిష్కారం చూపాలనే ముగ్గురు సీఎంలు ఇక్కడ కలుసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం చర్చలు కొలిక్కి వచ్చాయని, కేంద్రమంత్రి సీఆర్? పాటిల్? పరిష్కారం చూపుతారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజోలి బండ డైవర్షన్ స్కీం ద్వారా రావాల్సిన 15.9 టీఎంసీల్లో ఐదారు టీఎంసీలే వస్తున్నాయన్న ఆయన దాదాపు పది టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తాం**

తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి తరలింపు వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచనతో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రోజును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబోతున్నారని, తుంగభద్ర ఒడ్డున చర్చలు చరిత్రలో గొప్ప నిర్ణయంగా మారబోతున్నాయని అన్నారు. ఈ నిర్ణయం అంతర్రాష్ట్ర జల వివాదాలకు పరిష్కారం చూపుతుందని విశ్వసిస్తున్నామని చెప్పారు. "3 రాష్ట్రాల ప్రతినిధులం ఏది ఏమైనా సరే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి. ఈరోజు బళ్లారి వేదిక కావాలి. ఈ తుంగభద్ర డ్యామ్? నది ఒడ్డున శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపించాలని, ఈరోజు ఒక ఆలోచన, పట్టుదలతో మేం ఇక్కడికి వచ్చాం. మా చర్చలు ఓ కొలిక్కి వచ్చాయి. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం, సీఆర్? పాటిల్? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారని మేము సంపూర్ణంగా విశ్వసిస్తున్నాం. ఈ రోజు తుంగభద్ర నది ఒడ్డున జరుగుతున్న చర్చలు చరిత్రలో గొప్ప నిర్ణయంగా మారబోతున్నాయి. ఈ నిర్ణయం తప్పకుండా కృష్ణ, తుంగభద్ర, గోదావరి నది జలాల్లో అంతర్రాష్ట్ర జల



వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని మేం సంపూర్ణంగా విశ్వసిస్తున్నాం" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

**15 టీఎంసీలు ఉంటే నాలుగైదే**

అంతరాష్ట్ర జలవివాదాలు, సమస్యలకు కేంద్రమంత్రి పరిష్కారం చూపుతారని విశ్వసిస్తున్నామన్న ఆయన కేంద్ర జల్?శక్తిశాఖ మంత్రి సీఆర్? పాటిల్ మృదుస్వభావి అని అన్నారు. రాజోలిబండకు కేటాయించిన 15 టీఎంసీల్లో తెలంగాణ నాలుగైదు టీఎంసీలే వాడుకుంటోందని రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు ఏపీ సీఎం చంద్రబాబని, దేశంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత అని కొనియాడారు.

**20వ గేటును ప్రారంభించిన సీఎం**

అంతకుముందు కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లను మూడు రాష్ట్రాల సీఎంలు డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కలిసి ప్రారంభించారు. తుంగభద్ర ప్రాజెక్టు 20వ గేటును సీఎం రేవంత్ రెడ్డి, 18వ గేటును కర్ణాటక సీఎం డీకే శివకుమార్, 19వ గేటును ఏపీ సీఎం చంద్రబాబు, 17వ గేటును కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ప్రారంభించారు.

తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ప్రారంభోత్సవం జరగడానికి ముందు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కలుసుకున్నారు. హోస్పేట్‌లోని ఐఆర్?బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్? రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కలవరం

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఉదాసీన వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై సీరియస్ నెస్ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ విషయంలో ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్న నివేదికలు కాంగ్రెస్ నాయకత్వాన్ని కలవరానికి గురి చేస్తున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకింత ముందంజలో ఉన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి ఉదాసీన వైఖరిని వీడకుంటే నియోజకవర్గాల్లో మరొక నేతను పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంటే రాజకీయ పార్టీల్లో గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించడం వల్లనే అక్కడ టీఎంసీ, డీఎంకేలు ఓటమి పాలయినట్లు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పదే పదే చెబుతున్నప్పటికీ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో మాత్రం మొద్దు నిద్ర వదల్లేదన్నది వాస్తవం. తన నియోజకవర్గంలో తామే కింగ్ ల మని భావిస్తున్నారు తప్పించి, ఓట్లను తొలగిస్తే రానున్న ఎన్నికల్లో గెలవలేమన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారని రేవంత్ రెడ్డి సయితం ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ లెవెల్ కమిటీలతో... మరొకవైపు బూత్ లెవెల్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ లో ఏదైనా ఓట్లు తొలగిస్తే అభ్యంతరాలను తెలియజేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పనిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు హరీశ్ రావులు జిల్లాల్లో పర్యటిస్తూ నేతలతో సమావేశమవుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై వారిని అలెర్ట్ చేస్తున్నారు. కాంగ్రెస్ లో మాత్రం అధికారంలో ఉండి కూడా తమ నియోజకవర్గంలో ఓట్లను కాపాడుకునేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం వల్లనే రేవంత్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికలలో టిక్కెట్ ఉండదని కూడా హెచ్చరించి రేవంత్ ఎమ్మెల్యేలకు ఫుల్లు వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన శాఖపై సంతృప్తి కరంగా లేరని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆర్థిక శాఖ మరింత చికాకు



తెస్తుందని మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడుతున్నారని తెలిసింది. సంక్షేమ పథకాలకు నిధులను కేటాయించడంతో పాటు వివిధ శాఖలకు చెందిన పెండింగ్ బకాయిలను విడుదల చేయడం తనకు తలనొప్పిగా మారిందని మల్లు భట్టి విక్రమార్క తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం చేసిన అప్పులతో పాటు ప్రస్తుతం తాము వడ్డీలు చెల్లించడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు కష్టంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఇంకా అప్పులు తేవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగుల జీతాలతో పాటు వారికి అందాల్సిన ప్రయోజనాలను అందించడంతో తాను విఫలమవుతానన్న భయం మల్లు భట్టి విక్రమార్క లో మొదలయిందని ఆయన సన్నిహితులు కూడా అంటున్నారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులను సర్దుబాటు చేయాలన్నా తలప్రాణం తోకకు వచ్చినట్లవుతుందని మల్లు భట్టి విక్రమార్క అంటున్నారని తెలిసింది. ఏదో ఒక కొత్త సమస్య రావడం, దానికి నిధులతో ముడిపడి ఉండటంతో తనకు ఈ శాఖ భారంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. నెల మొదటి వారం వచ్చిదంటే చాలు భయం వేస్తుందని ఆయన ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు వివిధ సంఘాలతో వరసగా తానే సమావేశాలను ఏర్పాటు చేసి నిధుల సర్దుబాటు చేయడానికి వారిని బుజ్జగించాల్సి వస్తుందని, నిధులు సకాలంలో విడుదల చేయకపోతే మాట తప్పిన వారమవుతామని మల్లు భట్టి విక్రమార్క ఆవేదన చెందుతున్నారు. ఖజానా బోసి పోయి ఉండటం, ప్రతి నెలా అప్పులు తేవడం తనకు సమస్యగా మారిందని, వీలయినంత వరకూ త్వరలోనే ఈ శాఖను వదిలించుకోవాలన్న భావనలో మల్లు భట్టి విక్రమార్క ఉన్నట్లు చెబుతున్నారు. పేరుకు ఆర్థిక శాఖ అయినప్పటికీ ఈ శాఖ మంత్రిగా తనకు సంతృప్తి కరంగా లేదని, మరొక శాఖ అయితే తన పనితీరుతో మెప్పించే పనిని చేసేవాడినని మల్లు భట్టి విక్రమార్క తన మిత్రుల వద్ద వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద మల్లు భట్టి విక్రమార్క పట్టువదలని విక్రమార్కుడిలా ఆర్థిక గండం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రులు కితాబు ఇస్తుండటం గమనార్హం.

# దారుస్సాలామ్‌కి ఏమైంది..

**హైదరాబాద్ :** దారుస్సలామ్.. హైదరాబాద్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరు. ఎంఐఎం పార్టీ కేంద్రకార్యాలయమే దారుస్సలామ్. ఒకప్పుడు .. ఈ కార్యాలయం వచ్చిపోయే వారితోనే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండుగా కిక్కిరిసి ఉండేది. తమ సమస్యలు చెప్పుకొనే వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చే వారు. పార్టీ చీఫ్.. అసదుద్దీన్ ఓవైసీ ఉన్నా.. లేకపోయినా.. పార్టీ కార్యాలయం మాత్రం నిండుగా కనిపించేది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఇక్కడ తిష్ఠవేసు కుని పార్టీ కోసం పనిచేసిన పరిస్థితి కూడా ఉండేది. కానీ.. గత రెండు మాసాలుగా దారుస్సలామ్ బోసిపోయిన పరిస్థితిని నెలకొంది. వచ్చేవారు లేరు. వచ్చినా.. ఇక్కడ సమాధా నం ఇచ్చేవారుకూడా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జాతీయ రాజకీయాలపై ఆయన ఎక్కువగా దృష్టి పెట్టారు. యూపీ సహా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఎంఐఎం జాడలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పోటీ చేసింది. గతంలో బీహార్‌లోనూ పార్టీ పోటీ ఇచ్చింది.దీంతో అసదుద్దీన్.. జాతీయ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇక, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే అక్బరు ద్దీన్ .. కేవలం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడే కనిపిస్తున్నారని సమాచారం. ఎక్కువ భాగం.. విదేశాల్లోనే ఉంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీకార్యాలయంలో కార్యక్రమాలు మందగించాయి. అదేసమయంలో వచ్చిపోయే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇదిలావుంటే.. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీకి ఏళ్ల తరబడి తిరుగులేదన్న వాదన తెలిసిందే అంతేకాదు.. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఓవైసీ కుటుంబానికి చెందిన నాల్గవ తరం వారసుడు అక్బరుద్దీన్ ఓవైసీ కుమారుడు నూరుద్దీన్ ఓవైసీ రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, ఆ జాడ కూడా ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇదే పాత బస్తీకి చెందిన మరో పార్టీకి అండగా ఉంటున్నదన్న సమాచంర హల్చల్ చేస్తోంది. దీంతో ఎంఐఎం ప్రభ తగ్గుతోందా? అనేది చర్చకు దారితీసింది. ఇక, జాతీయస్థాయిలో దృష్టి పెట్టినా.. ఎంఐఎంకు అనుకున్నంత మైలేజీ లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. ఇలా.. స్థానికంగా దృష్టి పెట్టకపోవడం, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్ననేపథ్యంలో దారుస్సలామ్‌లో జనాల తాకిడి తగ్గిపోగా.. పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనిని సరిచేసుకుంటారా? లేక... ఇంతే అని వదిలేస్తారో చూడాలి.

## నేను గుంపు మేస్త్రీనే ఈ గుంపంతా నాదే

-మొదటిపేజీ తరువాయి

ప్రమాద బీమా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా సదుపాయం**

ఉద్యోగులకు ప్రమాద బీమాను మొదట సింగరేణిలో ప్రారంభించామని, సింగరేణిలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే రూ.కోటి చొప్పున చెక్కులు అందజేశామని సీఎం గుర్తు చేశారు. పోయిన ప్రాణాన్ని తెచ్చివ్వలేము కానీ ఆర్థికంగా ఆదుకుని బాసటగా నిలవాలని తెలిపారు. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడిన వారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిపై ఉందని స్పష్టం చేశారు. సింగరేణిలాగే రాష్ట్రంలో ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా సదుపాయం కల్పించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కోరానని పేర్కొన్నారు.

**రేవంతన్న అని పిలిపించుకోవటమే ఇష్టం**

తాను గుంపుమేస్త్రీనేనని, అలా చాలామంది తనను అవహేళన చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందరూ హేళన చేసినా, బాధపడనని, ఈ గుంపంతా తనదేనని తేల్చి చెప్పారు. తన గుంపులో ఉన్నవారంతా చక్కగా తన పనిచేస్తుంటారని కొనియాడారు. కొందరు తాము దొరలమని, గడీలు ఉన్నాయని గొప్పలు చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. తనకు మాత్రం రేవంతన్న అని పిలిపించుకోవటమే ఇష్టమని స్పష్టం చేశారు. ఇష్టం, ప్రేమ ఉంటేనే సీఎంను కూడా అన్నా అని పిలుస్తారని తెలిపారు.

**ఫస్టు తారీఖున జీతాలు ఇస్తున్నాం**

ఐదేళ్లకోసారి పాలకులు మారినా ప్రభుత్వ ఉద్యోగులు మారరని అన్నారు. గతంలో పదేళ్లపాటు ఉద్యోగులకు 10 తారీఖులోపు జీతం వచ్చేది కాదని, గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలను కూడా వాయిదాలుగా ఇచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం, ప్రజల కోసం కష్టపడేవారికి సకాలంలో జీతాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని, ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ఫస్టు తారీఖున జీతాలు ఇస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున బెనిఫిట్స్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు.

## కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

-మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. "రైతులకు రూ.2 లక్షల ఏకకాల రుణమాఫీ అని చెప్పి సగం మందికే చేశారు. రైతు భరోసా, విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు అడ్రస్ లేవు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల కల్పన అని చెప్పి నమ్మించి నట్టేట ముంచారు" అని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై జనం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని... అటు కరెంట్ కోతలు, ఇటు సాగునీటి ఇబ్బందులు చూసి మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు.

## మీరు ఇవ్వరు.. విద్యార్థుల నుంచి వసూలు చేసుకోనివ్వరా

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఇచ్చిన జీవోపై వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ కళాశాలలు వేసిన పిటిషన్లపై హైకోర్టు ఇవాళ కూడా విచారణ జరిపింది. బకాయిలు రాకపోతే కళాశాలలు ఎలా నడుపుతారని ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. మీరు బకాయిలు చెల్లించరు, విద్యార్థుల నుంచి వసూలు చేసుకోనివ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? బకాయిలు ఎందుకు విడుదల చేయలేదు? పెండింగ్ బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారని ప్రశ్నల వర్షం కురిపించింది. ఆగస్టు 15లోపు ఫీజు బాకాయిలన్నీ క్లియర్ అవుతాయని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అయితే ఆగస్టు 15నే పిటిషన్లు విత్‌డ్రా చేసుకుంటామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సమాధానమిచ్చాయి.

**మధ్యలో మేం నలిగిపోతున్నాం**

ఇదే విషయంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం, యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని, వారి తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలు ఈ ఏడాది చేరిన విద్యార్థులకే వర్తించేలా చూడాలని కూడా విన్నవించారు. వాదనలు విన్న ధర్మాసనం, జీవో 9లోని కొన్ని నిబంధనలపై వచ్చే మంగళవారం వరకు స్టే విధించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.

## మొక్కజొన్న రికార్డ్ ధర....

**వరంగల్ :** వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న పంటకు రికార్డు స్థాయిలో క్వింటాకు రూ.2310 ధర లభించింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు సమానంగా ప్రైవేటు వ్యాపారులు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి అని మార్కెట్ అధికారులు తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్ తన రెండెకరాల్లో పండించిన 72 క్వింటాళ్ల మొక్కజొన్నను ఈ ధరకు విక్రయించి భారీ లాభాలు గడించారు. ప్రభుత్వ మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో కొనుగోళ్ల జాప్యం కారణంగా పంటను ఇంట్లోనే నిల్వ ఉంచిన రైతుకు.. ఓపెన్ మార్కెట్లో ఈ ఊహించని భారీ ధర లభించడంతో హర్షం వ్యక్తమవుతోంది.ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. మంగళవారం జరిగిన పంట కొనుగోళ్లలో మొక్కజొన్న పంటకు మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర లభించింది. ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి మరీ క్వింటా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,310 ధర చెల్లించి కొనుగోలు చేశారు. ఓపెన్ మార్కెట్లో ఇంత భారీ మొత్తంలో ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాధారణంగా వచ్చే ధరల కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం.జిల్లాలోని పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్‌కు ఈ రికార్డు ధర దక్కింది. ఆయన తనకున్న రెండెకరాల భూమిలో రూ.50 వేల పెట్టుబడితో మొక్కజొన్న సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో రైతుకు ఎకరాకు ఆశించిన దానికంటే మంచి దిగుబడి వచ్చింది. మొత్తం రెండెకరాల నుంచి 72 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి సాధించారు. ఈ పంట సరుకును మంగళవారం ఎనుమాముల మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడి ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను పరిశీలించి క్వింటాకు రూ.2,310 చొప్పున మొత్తం పంటను కొనుగోలు చేశారు. పెట్టుబడితో పోలిస్తే రైతు దేవేందర్‌కు ఊహించని రీతిలో భారీ లాభం చేకూరింది.నిజానికి, ప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,400 గా ఉంది. అయితే ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన అధికారిక కొనుగోలు కేంద్రాల్లో సరుకు సేకరణ ప్రక్రియ తీవ్ర జాప్యంగా సాగుతోంది. టెక్నికల్ సమస్యలు, ఇతర కారణాల వల్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతుండటంతో రైతు దేవేందర్ ఇంతకాలం తన పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. మార్కెట్లో డిమాండ్ పెరిగే వరకు వేచి చూశారు. ప్రభుత్వ కేంద్రాల ఆలస్యం కారణంగానే తాను పంటను ఇంట్లో దాచుకోవాల్సి వచ్చిందని,..కానీ ఇప్పుడు ఓపెన్ మార్కెట్లోనే మద్దతు ధరకు కేవలం 90 రూపాయల తక్కువతో మంచి ధర రావడం చాలా సంతోషంగా ఉందని సదరు రైతు వెల్లడించారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు అత్యంత సమీపంగా ప్రైవేటు వ్యాపారులు రూ.2,310 లు వెచ్చించి మొక్కజొన్నను కొనుగోలు చేయడం ఇదే తొలిసారని ఎనుమాముల మార్కెట్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. సాధారణంగా మార్కెట్ సీజన్ ప్రారంభంలో వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తుంటారని కానీ ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన దిగుబడి కారణంగానే ఈ రికార్డు ధర సాధ్యమైందని వివరించారు. రాబోయే రోజుల్లో మిగిలిన రైతులకు కూడా ఇదే తరహాలో

## సంపాదకీయం

# చమురు ధరలు 50 డాలర్ల దిగువకు?

సుదీర్ఘ కాలంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల అమెరికా- ఇరాన్ ఎట్టకేలకు తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేయగా కాస్త ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అప్పటినుంచి ముడి చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. గరిష్ఠ స్థాయిల నుంచి పెద్ద మొత్తంలో పతనమై ప్రస్తుతం 4 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరడం ఊరట కలిగిస్తోంది. జూన్ 24న బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 75.45 డాలర్లకు పడిపోయింది. ఇవాళ ఒక్కరోజే 2 శాతానికిపైగా తగ్గింది. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభం కాగా అప్పుడు 70 డాలర్ల స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధర భారీగా పెరుగుతూ వెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఏకంగా 126 డాలర్ల స్థాయికి ఎగబాకింది. దాదాపు 70 శాతానికిపైగా పెరిగిందని చెప్పొచ్చు. ప్రధానంగా చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధి మూతబడటంతో ఈ క్రమంలోనే పలు దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పలు దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. తర్వాత మొదట కాల్పుల విరమణ, తర్వాత ఒప్పందం దిశగా అడుగులు పడటంతో చమురు ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు డీల్ కుదిరిన తర్వాత మరింత తగ్గుతూ వస్తోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రతి బారెల్‌కు 78 డాలర్లకు పడిపోయి.. గత మూడు నెలల కనిష్ట స్థాయిని తాకినా భారత ప్రభుత్వం ధరలు తగ్గించకపోవడంపై సామాజిక మాధ్యమ వేదిక 'రెడ్డిట్ లోని ఇండియన్ స్టాక్ మార్కెట్ ఫోరమ్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా భారత్‌లో ఇంధన ధరలను తగ్గించకపోవడంపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చమురు ధరలు తగ్గకపోతే ద్రవ్యోల్బణం పెరిగి.. ఆర్థిక వృద్ధి మందగిస్తుందని... ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొందరు నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డిబేట్‌లో వినియోగదారులపై పడుతున్న పన్నుల భారం ప్రధానంగా చర్చకు వచ్చింది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడు లీటరుకు ఎనిమిది రూపాయల వరకు పెంచిన ప్రభుత్వం... ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వం ఏటికేడు పిండేస్తోందని.. 2014 నాటి యూపీఏ ప్రభుత్వ కాలం నాటి వ్యతిరేక పరిస్థితులే ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కనిపిస్తున్నాయని కొందరు కామెంట్ చేశారు.మరోవైపు.. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలకు, దేశాలు కొనుగోలు చేసే భౌతిక మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని కొందరు ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. 2026 మార్చిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 నుండి 110 డాలర్లకు పెరిగినప్పుడు... ఆ భారాన్ని ప్రభుత్వం వినియోగదారులపై పడకుండా కొంతకాలం నియంత్రించిందని ఒక నెటిజన్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఇంధన ధరల స్థిరత్వాన్ని కాపాడటం వల్లే భారీ యుద్ధ సమయాల్లో కూడా దేశంలో ధరలు అదుపులో ఉన్నాయని, తక్షణమే ప్రయోజనాలు ఆశించడం సరికాదనే వాదన కూడా వినిపించింది. ఇంధన ధరల నియంత్రణకు గానూ ప్రభుత్వం చేపడుతున్న ఇథనాల్ బ్లెండింగ్ విధానంపైనా రెడ్డిట్ వినియోగదారులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చమురు ధరలు ఎంత తగ్గినా.. పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని తగ్గించి దాని స్థానంలో ఇథనాల్‌ను ఎక్కువగా కలుపుతున్నారని నెటిజన్లు ఆరోపించారు. దీనివల్ల సామాన్యుడికి ధరల భారం తగ్గడం లేదని... కేవలం ఇథనాల్ తయారుచేసే బడా వ్యాపారవేత్తలకు, పాలకుల కుటుంబాలకే లాభం చేకూరుతోందంటూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి కొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు.. ఈ ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా ఈవీ అడాప్టేషన్ వైపు మారడమే ఏకైక మార్గమని కొందరు అభిప్రాయపడగా... అది అంత సులువు కాదని మరికొందరు గణాంకాలతో వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 5 కోట్ల కార్లు, 26 కోట్ల ద్విచక్ర వాహనాలను ఈవీలుగా మార్చాలంటే దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని మరో 600 నుండి 700 శాతం పెంచాల్సి ఉంటుందని... లేదంటే గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా.. అంతర్జాతీయంగా తగ్గిన చమురు ధరల ప్రయోజనం దేశీయంగా సామాన్యుడికి అందడం లేదనేది ఈ మొత్తం చర్చ సారాంశం.ముడి చమురు ధర సమీప భవిష్యత్తులో మరింత తగ్గుతుందని భావిస్తుండగా, ఇది భారత్‌పై దిగుమతుల భారం తగ్గేలా చేస్తుంది. ధరలు నిరంతరాయంగా తగ్గుతుండటంతో, క్రూడాయిల్ బ్యారెల్‌కు 50 డాలర్ల కంటే కిందికి పడిపోతుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే, సమీప భవిష్యత్తులో ధరలు అంతగా పడిపోయే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ కేవలం భౌగోళిక రాజకీయాల నుంచి డిమాండ్-సప్లై సమీకరణాల వైపు మళ్లుతోంది. బ్రెంట్ క్రూడ్ రాబోయే రోజుల్లో 65 నుంచి 75 డాలర్ల పరిధిలో కదలాడవచ్చు. ధరలు 50 డాలర్ల దిగువకు వెళ్లాలంటే చైనా లాంటి పెద్ద దేశాల్లో డిమాండ్ దారుణంగా పడిపోవాలి, లేదా అంతర్జాతీయంగా చమురు నిల్వలు విపరీతంగా పేరుకుపోవాలి. ప్రస్తుతానికైతే అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.ఈ క్రమంలోనే రూపాయి విలువ పుంజుకోవడం సహా ద్రవ్యోల్బణం భయాలు కూడా తగ్గుముఖం పడతాయి. యుద్ధం ప్రారంభం నాటి నుంచి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న చమురు నౌకలు/ట్యాంకర్లు ఇప్పుడు హోర్ముజ్ జలసంధిగుండా రాకపోకలు ప్రారంభించాయి. ఇది మరింత సానుకూల పరిణామాల్ని తీసుకొచ్చింది. మరోవైపు ఇరాన్‌పై ఇన్ని రోజులు ఉన్న ఆంక్షల్ని కూడా అమెరికా సడలించింది. ఇరాన్ చమురు క్రయవిక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మార్కెట్లో చమురు లభ్యత పెరిగి ధర తగ్గుతోంది. అయినప్పటికీ సామాన్య వినియోగదారులకు వెంటనే ఊరట కలగకపోవచ్చని భావిస్తున్నారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశీయంగా చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశాలు ఉండవని నిపుణులు పేర్కొంటున్నారు.ఇటీవల యుద్ధం సమయంలో మే నెలలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు సగటున రూ. 7.50 వరకు పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.73 గా ఉండగా, డీజిల్ లీటరుకు రూ. 103.82 గా ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్‌లోనే ఇంధన ధరలు అధికంగా ఉన్నాయి.

# వేడెక్కిన నార్త్ పాలిటిక్స్



త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది.కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్‌లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. కేంద్ర కేబినెట్ భేటీ కానుందని, ఆ తర్వాత మంత్రుల శాఖల మార్పు లేదా కొత్త వారికి కేబినెట్ లోకి తీసుకోవడంపై ప్రకటన రావచ్చని తెలుస్తోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టూలను బీజేపీ మళ్లీ రాజ్యసభకు పంపలేదు. మరోవైపు బిట్టూ ఇంకా రాజీనామా చేయలేదు. అయితే, తాను పంజాబ్ రాజకీయాల్లోకి తిరిగి వస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు.'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు.దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్‌లో చోటు కల్పించవచ్చు. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల (వెనుకబడిన, దళిత, మైనారిటీ) ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్‌నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ఢిల్లాన్‌ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్‌లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్నాయి. ఎన్నికల కంటే ముందే ఏ వర్గంలోనూ అసంతృప్తి తలెత్తకుండా ఉండేందుకు, ఇక్కడి వివిధ వర్గాల నాయకులకు కేబినెట్ లేదా పార్టీ సంస్థాగత పదవుల్లో చోటు కల్పించి సమతుల్యతను సాధించాలని బీజేపీ భావిస్తోంది.

# బ్రిటిష్ 'లేబర్' గట్టెక్కేదెలా?



అధికారానికి దూరంగా దాదాపు 14 యేళ్ల సుదీర్ఘ నిరీక్షణలో గడిపిన లేబర్ పార్టీని 2024 జూలైలో విజయపథాన నడిపించి, 411 సీట్లు సాధించిపెట్టిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రెండేళ్లు తిరక్కుండా విఫల నేతగా ముద్రపడి నిష్క్రమించబోతున్నారు. ఆయన స్థానంలో పార్టీ నేతగా ఎన్నికై వచ్చేనెల 17 తర్వాత ప్రధాని పగ్గాలు చేపడతారని అందరూ భావిస్తున్న ఆండీ బర్న్‌హామ్ గురించి పార్టీలో అంచనాలు దండిగానే ఉన్నాయి. బర్న్‌హామ్ వాటిని అందుకోగలిగితే 2029లో పార్టీ మరోసారి అధికారంలోకి రాగలుగుతుంది. 1760లో పారిశ్రామిక విప్లవానికి బీజంపడిన ఉత్తర ఇంగ్లండ్‌లోని గ్రేటర్ మాంచెస్టర్‌కు మేయర్‌గా పనిచేసి బర్న్‌హామ్ సాధించిన ఘన విజయాలు తక్కువేమీ కాదు.
2017లో నగర బాధ్యతలు స్వీకరించాక... నాలుగు దశాబ్దాలుగా ప్రైవేటు రంగంలో ఉంటూ, నాసిరకం సేవలతో జనాన్ని ఇబ్బందులపాలుచేసిన బస్సు రవాణాను తిరిగి ప్రభుత్వ రంగ నియంత్రణలోకి తీసుకొచ్చారు. బస్సులు, ట్రామ్‌లు, సైక్లింగ్ మార్గాలను అనుసంధానిస్తూ లండన్ తరహా 'బీ నెట్ వర్క్'ను ఏర్పాటుచేశారు. ప్రజలకు మెరుగైన, చవకైన ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. గ్రేటర్ మాంచెస్టర్‌ను యూరప్‌లోనే అత్యంత పర్యావరణహిత నగరాల్లో ఒకటిగా మార్చేందుకు కృషి చేశారు. ఈ విజయాలే ఈ నెల మొదట్లో మాంచెస్టర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన్ను ఎంపీగా నెగ్గించాయి. బర్న్‌హామ్ ప్రధాని పదవికి పోటీపడగలరని ఎవరూ అనుకోలేదు. పార్లమెంటుకొచ్చి నిండా నెల రోజులు కాకుండానే పార్టీ నాయకత్వానికి సంసిద్ధమని ఆయన ప్రకటించటం, స్టార్మర్ ప్రధాన ప్రత్యర్థిగా అంతవరకూ అనుకున్న మాజీ ఆరోగ్యమంత్రి వెస్ స్ట్రీటింగ్ బర్న్‌హామ్‌కే మద్దతిస్తున్నట్టు ప్రకటించటంతో అందరూ విస్మయపడ్డారు. నిజానికి 2024 ఎన్నికల్లో లేబర్ విజయంలో స్టార్మర్ దీక్షాదక్షతలొక్కటే పనిచేయలేదు. అప్పటికే అంతర్గత కలహాలతోవున్న కన్సర్వేటివ్ పార్టీ బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి సునాక్‌లను ప్రధానులుగా తెచ్చినా కుదుటపడలేకపోయింది. ఈ రాజకీయ అస్థిరత ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. ఇలాంటి దశలో స్టార్మర్ పగ్గాలు చేపట్టి పార్టీని తీవ్ర వామపక్ష విధానాలనుంచి మధ్యేవాద పథానికి తీసుకొచ్చారు. గతంలో లేబర్ నేత టోనీ బ్లెయిర్ ప్రధానిగా దేశాన్ని భ్రష్టుపట్టించిన వైనం జనం మరిచేలా చేసి, తటస్థుల ఓట్లు సైతం రాబట్టారు. అయితే ఎన్నికల్లో నెగ్గటం వేరు... ప్రభుత్వాధినేతగా సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించి, దేశాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించటం వేరు. ఈయూ నుంచి తప్పుకుంటే దేశం బ్రహ్మాండంగా పురోగతి సాధిస్తుందని నమ్మి పదేళ్ల క్రితం దానివైపు మొగ్గిన జనం అన్నివిధాలా నష్టపోయామని ఆలస్యంగా గ్రహించారు. తిరిగి ఈయూలో చేరాలనే స్వరాలు పెరిగాయి. ఈ విషయంలో తన వైఖరేమిటో స్టార్మర్ చెప్పలేదు. అసమానతల్నీ, దారిద్ర్యాన్నీ పారదోలటానికి... జనం ఎదుర్కొంటున్న ఆవాస సమస్యను అధిగమించటానికి ఏం చేయాలన్న ప్రణాళికలకు బదులు అంతకంతకూ బలపడుతున్న తీవ్ర మితవాద పక్షం రీఫామ్ యూకే పార్టీని ఎలా ఎదుర్కొనాలన్న అంశంపైనే ఆయన దృష్టి పెట్టారు. నైజెల్ ఫరాజ్ నాయకత్వంలోని ఆ పార్టీని అనుకరించే ప్రయత్నం చేశారు. గాజాలో ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని సమర్థించటం, దాన్ని ఖండిస్తూ ఉద్యమించిన పాలస్తీనా యాక్షన్ సంస్థను ఉగ్రసంస్థగా ప్రకటించటం, వలసలపైనా ఆంక్షలు విధించటంలాంటివి చేశారు. ఫరాజ్ పార్టీని కాపీ కొడితేనే దాన్ని ఓడించటం సులభమన్న ఆయన తెలివితక్కువతనం లేబర్ పార్టీకి శాపంగా మారింది. ఉత్తర ఇంగ్లండ్, మిడ్‌లాండ్స్ వంటి కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల్లో లేబర్ చేతుల్లోవున్న వేలాది కౌన్సిలర్ స్థానాల్నీ, కౌన్సిళ్లనూ ఫరాజ్ పార్టీ కైవసం చేసుకుంది. జాతీయ సర్వేల్లో సైతం ఏకంగా 27 శాతం వరకూ ఓటింగ్ సాధించి లేబర్‌ను మూడో స్థానంలోకి నెట్టింది. దాంతో లేబర్ ఎంపీలంతా వణికిపోయారు. స్టార్మర్‌ను సాగనంపకుంటే భవిష్యత్తు శూన్యమని గ్రహించారు. నైతికత, సిద్ధాంతాలు లేకుండా గాలివాటు రాజకీయాలకు పాల్పడితే జనం మెచ్చరని స్టార్మర్ ప్రస్థానం నిరూపించింది. బర్న్‌హామ్ ఆయన్నుంచి గుణపాఠం నేర్చుకుని సమర్థ పాలన అందించగలిగితే లేబర్ కోలుకోవటం ఖాయం.

## 24 గంటల్లో 300 మి.మీ. వర్షపాతం!

దేశంలోని పలు రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. అటు ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌ను హఠాత్తుగా వచ్చిన వరదలు ముంచెత్తగా.. ఇటు దేశ ఆర్థిక రాజధాని ముంబైని రికార్డు స్థాయి వర్షపాతం అతలాకుతలం చేస్తోంది. కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.అరుణాచల్ ప్రదేశ్‌లో కురిసిన అతిభారీ వర్షాలు ఊహించని జలప్రళయాన్ని సృష్టించాయి. ముఖ్యంగా కేయీ పన్యోర్, లోయర్ సుబన్‌సిరి జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడటంతో పాటు ఒక్కసారిగా ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించాయి. యాజలి, పోసా, యీయీ వంటి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వందలాది ఇళ్లు, వేల ఎకరాల్లో సాగు చేసిన వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పోసాలోని కాలనీలో సుమారు 15 నివాస గృహాలు వరద ఉద్ధృతికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ ప్రధాన రహదారి వంతెన వరద నీటిలో కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.తక్కువ సమయంలోనే అత్యంత భారీ వర్షపాతం నమోదు కావడం వల్ల నదులలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి ఈ ఘోర పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ఈ వరదల ధాటికి పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందుతోంది. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న ఈ భారీ వర్షాల ప్రభావం దిగువన ఉన్న అసోం రాష్ట్రంపై పడే అవకాశం ఉంది. అరుణాచల్ నదుల నుంచి వచ్చే వరద నీటి వల్ల అసోంలోనూ వరద ముప్పు పొంచి ఉండటంతో అక్కడి ప్రభుత్వం తీవ్ర అప్రమత్తత ప్రకటించింది. ప్రజలు ఎవరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, దేశ ఆర్థిక రాజధాని ముంబైని సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నవీ ముంబైతో పాటు నగరంలోని పలు కీలక ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రసిద్ధ దాదర్ స్టేషన్‌లో రైలు పట్టాలపై భారీగా నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు నీట మునిగాయి. అనేక చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ మైళ్ల మేర నిలిచిపోయింది. గడిచిన 24 గంటల్లోనే నగరంలో ఏకంగా 300 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (ఃఓఅ) వెల్లడించింది. ముంబైలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది.

# కల్వకుర్తి ఎస్సీ కాంప్లెక్స్ కేటాయింపుల్లో అక్రమాలు

## భగ్గుమన్న దళిత కుటుంబాలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపులు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. నిరుపేద దళిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా పక్కదారి పట్టింది. నిబంధనలను తుంగలో తొక్కి, అనర్హులైన బడాబాబులకు అధికారులు దొడ్డిదారిన షట్టర్లను కట్టబెట్టడం పట్ల స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిరుపేద దళితులకు దక్కాల్సిన ఈ షాపులను స్థానిక మున్సిపల్ కౌన్సిలర్, ఒక ప్రభుత్వ ఉద్యోగి కుటుంబ సభ్యులతో పాటు.. ఉన్నత చదువులు చదువుతున్న వారికి, మున్సిపాలిటీ సిబ్బంది బంధువులకు సైతం కేటాయించడం విస్మయానికి గురిచేస్తోంది. రాజకీయ అండదండలు, పలుకుబడి ఉన్నవారికే దొడ్డిదారిన పెద్దపీట వేస్తూ ఏళ్ల తరబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన దళిత అభ్యర్థులకు అధికారులు మొండిచేయి చూపారు.తమకు జరిగిన ఈ ఘోర అన్యాయాన్ని నిరసిస్తూ అర్హులైన దళిత అభ్యర్థులు ఆందోళన బాట పట్టారు. కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట వారు రిలే నిరాహార దీక్షలకు దిగారు. నిరసనకారులు దీక్షా శిబిరంలో కూర్చుని ప్లకార్డులు




చేతబూని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అర్హులైన దళిత యువతకే షట్టర్లు కేటాయించాలి పక్షపాతం వీడాలి ప్రతిభను గౌరవించాలి రాజకీయ జోక్యం నశించాలి అంటూ నినాదాలు చేశారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, అక్రమంగా జరిగిన ఈ కేటాయింపులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పారదర్శకంగా అర్హులకు మాత్రమే న్యాయం చేయాలని కోరుతున్నారు. అనర్హుల కేటాయింపులు రద్దు చేయని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని దీక్షా శిబిరంలోని దళిత నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో నేరటి మల్లేష్, శ్రీను, శ్యాంపూరీ చెన్నయ్య, పోలే శ్రీకాంత్, ఎడ్ల బాలరాజు, చిన్న, రాజు, మల్లేష్, మూర్తి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై ప్రజల్లో చర్చ జరగాలి
## రాజకీయ వ్యవస్థపై తీవ్ర విమర్శలు

అగ్ని ధార న్యూస్,( రామగుండం):



ప్రస్తుత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో అవినీతి తీవ్రంగా పెరిగిందని, ప్రజల సంపద దోపిడీకి గురవుతోందని సామాజిక కార్యకర్త అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి స్థాయి నుంచి గ్రామ సర్పంచ్ వరకు అవినీతి వ్యవస్థ విస్తరించిందని ఆయన ఆరోపించారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, బ్యూరోక్రాట్లు ప్రజాసేవ కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద మొత్తాల్లో అవినీతి, లంచగొండితనం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంటరీ రాజకీయ పార్టీల ద్వారా దీనికి పరిష్కారం సాధ్యమేనా అనే అంశంపై ప్రజల్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. దేశంలో రాజకీయ నాయకులు ప్రజలకు న్యాయం చేయడానికి కాకుండా అధికారాన్ని వినియోగించుకునేందుకే రాజకీయాల్లోకి వస్తున్నారని, కొంతమంది అధికారులు కూడా విధి నిర్వహణ కంటే అక్రమ సంపాదనపై ఆధారపడుతున్నారని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మరోవైపు, బోల్షెవిక్ భావజాలాన్ని అనుసరించే వారిలో నిజాయితీపరులు అధికంగా ఉన్నారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పార్లమెంటరీ రాజకీయాల్లో ఉన్న నిజాయితీపరుల జాబితాను ప్రజల ముందుకు తీసుకురావాలని సవాల్ విసిరారు. ఈ అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించి బహిరంగ చర్చలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## నుతన దంపతులను ఆశీర్వదించిన
## ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండలం బోలంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ప్రకాష్ సోదరుని కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వాదించి శుభాకాంక్షలు తెలిపిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో,కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,మాజీ సర్పంచ్ పవన్ కుమార్,మాజీ ఉప సర్పంచ్ నిరంజన్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్,అంజి మాస్టర్, వెంకటయ్య,ఉద్యమకారుడు శ్రీరాములు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి
## ఆశీర్వాదంతో ప్రజలు చల్లశీగా ఉండాలి



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న
సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడుగుల మండలంలోనినల్లవారిపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఢ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,శాంతి సామరస్యాలతో జీవించాలని ఆకాంక్షించారు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతలో సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని పేర్కొన్నారు, అలాగే గ్రామస్తుల కోరిక మేరకుగ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల ఆలయాన్ని సందర్శించి,ఆలయ అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,గ్రామ సర్పంచ్ ఎల్లగొండ్ల జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్,మహిళ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు విజయ రెడ్డి, స్థానిక సీనియర్ నాయకులు మల్లయ్య,యాదగిరి, పెద్దయ్య,మల్లేష్,పాండు, నరసింహ,సుభాష్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు,భక్తులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి




సర్వేలో పాల్గొన్న సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించిన సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని 53, 54, 55 గల బూతులలో ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా తాజా ఓట్లను జాబితాలో చేర్పించాలని 2025 ఓటర్ జాబితాలోని అర్హులైన ఓటర్లందరినీ 2002 ఓటర్ జాబితాలో అనుసంధానం చేసి ప్రక్రియ వేగవంతం చేసి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి మ్యాపింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ సూచించారు. దీంతో ఎన్నికల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో,పంచాయతీ కార్యదర్శి బండపల్లి రమేష్ , విఆర్వో శైలజ,బి ఎల్ ఓ సునంద రమాదేవి సరస్వతి బి ఎల్ ఏ దేశ వెంకటరెడ్డి ఫోటో కిషోర్ తాండ తిరుపతయ్య మేకల స్వామి దస్తగిరి మహేష్ గౌడ్ యాదయ్య వంశీ , సికిందర్ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన
## గోలి శ్రీనివాస్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



అమనగల్ మండలం పోల్లేపల్లి మాజీ ఎంపీటీసీ కుమార్ సోదరుని వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వాదించి శు భాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమంలో, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్,ఉద్యమకారుడు శ్రీరాములు,కృష్ణయ్య,సురేష్ నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి
## ఎంచుకోవడం అభినందనీయం



వాషింగ్ సెంటర్ ప్రారంభించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి పట్టణంలోని కళ్యాణ్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ కార్ వాషింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్-సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ప్రారంభోత్సవం అనంతరం ఎస్ ఆర్ కార్ సెంటర్ యజమాని రాజు మరియు వారి కుటుంబ సభ్యులకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారు ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగి ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు,ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుని ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు, నేటి పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని,కష్టపడి పనిచేస్తే యువత మంచి విజయాలను అందుకోవచ్చని పేర్కొన్నారు, యువతలో వ్యాపార దృక్పథం పెరగడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలోఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్,కొండల్ యాదవ్, శ్రీపతి, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల ట్రస్ట్ ద్వారా నిరుపేద దళిత
## ఆడబిడ్డ వివాహానికి చేయూత




బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల కేంద్రంలో నీ ముదిగొండ రవణీల కూతురు అనూష ఢ ముదిగొండ యాదయ్య కుమారుడు వినోద్ కుమార్ వివాహానికి తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల్ వెంకటేష్ తన ట్రస్టు ద్వారా 200 కేజీల బియ్యం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ గుళ్ళ సుధాకర్, వార్డు సభ్యులు ప్రమీల సత్యం గౌడ్, మహేశ్వరి నిరంజన్, నాయకులు మదిగట్ల యాదయ్య, గుళ్ళ శేఖర్, తుడుం శంకరయ్య, తుడుం శేఖర్, శీలం మాధవులు, ముదిగొండ రవి, మదిగట్ల భగవాన్, తుడుం శ్రీశైలం, ముదిగొండ విజయ్ కుమార్, నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ కు ఫోన్ చేసి
## పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



వెల్దండ మండల కేంద్రానికి చెందిన గుద్దటి పారిజాత అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి వెంటనే స్పందించి ఫోన్ కాల్ ద్వారా ఆమె సమస్యలు తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ద్వారా 5000 రూపాయలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు ముదిగొండ కవితా రమేష్, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి ఎండి రషీద్ కొయ్యల పుల్లయ్య ఈదులపల్లి శ్రీనివాస్ కొమ్ము అంజయ్య పాల్గొని అందజేయడం జరిగింది

## నూతన వధూవరులను
## ఆశీర్వదించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి నియోజకవర్గశీలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఢ టాస్క్ సి.ఓ.ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పలు వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు, మాడుగుల మండలం, బ్రాహ్మణపల్లి గ్రామం సిరగోని మధు యాదవ్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు,అనంతరం చారకొండ మండలం, గోకారం గ్రామం నరేష్ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు,అనంతరం వెల్దండ మండలం బొల్లిగుట్ట తండా రాత్లవత్ నారాయణ కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులకు ఆశీస్సులు అందించారు, కడ్తల్ మండలం, గోవిందాయపల్లి తండా నేనావత్ పవన్ కళ్యాణ్ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు,

ఈ కార్యక్రమాల్లోకుటుంబ సభ్యులతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్,కొండల్ యాదవ్,శ్రీపతి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి ఆర్థిక సహాయం
## అందజేసిన కౌన్సిలర్ పాపిశెట్టి రామ్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల మండలంలోని ముద్విన్ గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న ఇర్లపల్లి సాయిలయ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఇర్లపల్లి శేఖర్ ద్వారా విషయాన్ని తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసిన ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకులు అమనగల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము బాధితుని పరామర్శించి ఎల్లపుడూ అండగా ఉంటానని భరోసా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్ దేరంగుల భుజంగం రాకేష్ కుటుంబ సభ్యులు తరతరులు పాల్గొన్నారు

# నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఉద్యోగం పొందిన వారితో టాస్క్ సి ఓ ఓ కాంగ్రెస్ నాయకులు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ కల్వకుర్తి**

కల్వకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతర కృషి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ ఔ టాస్క్- సి.ఓ.ఓ. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో

మరో 22 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూ కు ముఖ్య అతిథిగా హాజరైన.

**సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

మాట్లాడుతూ, కల్వకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందించడంలో నిర్విరామంగా కృషీ చేస్తున్నామని ,పరిశ్రమలతో సమన్వయం చేసి యువతకు సరైన వేదికలు కల్పించడమే మా ప్రధాన లక్ష్యమని,ఇది కేవలం ఒక వ్యక్తి ఉద్యోగం మాత్రమే కాదని,వారి కుటుంబాలకు కూడా ఆర్థిక భరోసానిచ్చే ప్రయత్నంగా ముందుకు సాగుతున్నామని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని పెద్ద స్థాయి ఉపాధి కార్యక్రమాలు



నిర్వహించేందుకు మా ప్రయత్నం కొనసాగుతోందని తెలియజేశారు, ఈ కార్యక్రమాన్నిఉద్దేశించి ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు ఇలాంటి అవకాశాలు కల్పించడం చాలా గొప్ప విషయం,నిరంతరం యువత ఉపాధి అవకాశాలు కల్పించాలనే సుంకిరెడ్డి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ,ఇది యువత తో పాటు వారి కుటుంబాల్లో కూడా ఒక గొప్ప మార్పుకు బలమైన పునాది అని,ఇలాంటి గొప్ప కార్యక్రమాలలో మాకు ఎల్లవేళలా తోడుగా నిలుస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు,ఆమనగల్ మండలం 04 ,తలకొండపల్లి మండలం - 03, కడ్తల్ మండలం - 01 ,వెల్దండ మండలం - 12 ,కల్వకుర్తి మండలం - 02, మొత్తంగా నియోజవర్గం నుండి 22 మంది అభ్యర్థులు విజయవంతంగా ఇంటర్వ్యూ ప్రక్రియలో పాల్గొన్నారు,వీరికి ఉద్యోగంలో చేరిక వివరాలు త్వరలోనే తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలోప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులతో పాటు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ ,నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# యువత మేల్కొనాలి.. డ్రగ్స్‌ను తరిమికొట్టాలి

**గోదావరిఖని టూ టౌన్ సీఐ ఎన్. ప్రసాద్‌రావు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని గోదావరిఖని టూ టౌన్ సీఐ ఎన్. ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం గోదావరిఖని 8 ఇంక్లైన్ కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో స్పందన హైస్కూల్ విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ యువకులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మేల్కొని డ్రగ్స్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.తెలియకుండానే కొంతమంది యువకులు సిగరెట్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు




అలవాటు పడి తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారని అన్నారు. చెడు అలవాట్లకు బానిసైన పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచి, వారిని మంచి మార్గంలో నడిపించాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ సేవించడం లేదా రవాణా చేయడం వంటి ఘటనలు ఎక్కడైనా గమనించినట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 1908 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712671111కు సమాచారం అందించాలని సీఐ సూచించారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సీహెచ్ రాజయ్య, విశ్వనాథ్, ప్రదీప్ రెడ్డి, అఫ్రోజ్, దేవేందర్‌రావు, విజయమణి, స్పందన హైస్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ నుంచి ఆపరేషన్ కగార్ వరకు పౌరహక్కుల ఉల్లంఘనే

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

1975లో విధించిన ఎమర్జెన్సీ నుంచి నేటి ఆపరేషన్ కగార్ వరకు దేశంలో పౌరహక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ విధించి 51 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పౌరహక్కుల సంఘం (సీఎల్‌సీ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో "ఇందిరా ఎమర్జెన్సీ నుంచి మోడీ ఆపరేషన్ కగార్ వరకు -- పౌరహక్కుల ఉల్లంఘనలు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1975 ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసి, భిన్నాభిప్రాయాలను అణచివేస్తూ వేలాది మంది రాజకీయ నాయకులు, కార్యకర్తలను జైళ్లకు పంపిన ఘటనలను గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా వివిధ రూపాల్లో అదే నిర్బంధ ధోరణులు కొనసాగుతున్నాయని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేస్తూ,



విభిన్న స్వరాలను దేశద్రోహం, ఉగ్రవాదం పేరుతో అణచివేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా "ఆపరేషన్ కగార్" పేరుతో ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న సైనిక చర్యలు స్థానిక ప్రజల జీవన హక్కులను, రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలపై పెరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పౌరహక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘటిత హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు అంజన్న, సీఎల్‌సీ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్, జిల్లా ఉపాధ్యక్షులు నారా వినోద్, బండారి రాజలింగు, టీపీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు జైపాల్‌సింగ్, సామాజిక ఉద్యమకారులు ఎరుకల రాజన్న, ప్రజాసంఘాల నాయకులు రామిల్ల బాపు, యాదన్న, సమ్మన్న, దస్తగిరి, శంకరయ్య, పొలాస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు పరిష్కరించాలి

**ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు జేపీసీ వినతి**
**డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,(హైదరాబాద్):**

తెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత 130 సంవత్సరాలుగా నివసిస్తున్న షెడ్యూల్డ్ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న భూమి, నివాసం, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేపీసీ) రాష్ట్ర కన్వీనర్ డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న దళిత కుటుంబాలు నేటికీ అనేక ప్రాథమిక హక్కులకు దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేకపోవడంతో రైతు భరోసా, బ్యాంకు రుణాలు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. ఎల్‌టీఆర్ (1/70) చట్టంలోని నిబంధనల కారణంగా కుటుంబ విభజనలు, వారసత్వ బదిలీలు ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. దళిత బంధు పథకం కింద భూముల కొనుగోలు, పంపిణీ ప్రక్రియ కూడా చట్టపరమైన అడ్డంకులతో నిలిచిపోయిందని, స్థానిక ఎస్సీ కుటుంబాలకు ప్రత్యేక మినహాయింపులు కల్పించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నివాస స్థలాలు లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి ఉచిత ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను



మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో ఎస్సీలకు కేటాయించిన 15 శాతం రిజర్వేషన్‌ను స్థానిక కేడర్ నియామకాలలో పూర్తిస్థాయిలో అమలు చేసి, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంత దళితుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ప్రత్యేక అధ్యయనం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయాలని ఎస్సీ కమిషన్‌ను కోరినట్లు డా. మార్షల్ దుర్గం నగేష్ తెలిపారు. రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం మానవీయ దృక్పథంతో స్పందించి, దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేష్, ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్యవేదిక నాయకులు జాడి కృష్ణ, బసరికారి తిరుమల కుమార్, బుస్సాక రామచందర్, గన్న మహేష్, బాసరికారి మానస తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



**బాధిత్తునికి ఎల్ వో సి అందజేసిన ఎమ్మెల్యే**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండలంలోని బొమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన తెలుగు యాదయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అతని చికిత్స కొరకు అయినటువంటి ఖర్చుల నిమిత్తం ఎల్ వో సిచెక్కును 2,50,000అందించారు ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు పేద ప్రజలు ఎల్ ఓ సి తో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ప్రజా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కి ఎల్ఓసి రావడానికి కృషిచేసిన ధ్యాప నిఖిల్ రెడ్డి కిధన్యవాదాలు తెలియజేస్తున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువసేనపాల్గొన్నారు

## ఉప సర్పంచ్‌ల చెక్కు పవర్ రద్దు పై ఎంపీడీవోకి వినతిపత్రం అందజేత



**అగ్ని ధార న్యూస్ ( కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని ఉప సర్పంచ్‌ల చెక్కు పవర్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపీడీవో గాలి యాదయ్యకు కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల పరిపాలనలో ఏర్పడుతున్న సమస్యలు, అధికారాల దుర్వినియోగం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఈ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీడీవో గాలి యాదయ్య సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో,కల్వకుర్తి మండలంలోని గ్రామాల ఉపసర్పంచ్ లు నిజాముద్దీన్, ఇస్తరి,రవి,జంగయ్య,శ్రీను,తది తరులు పాల్గొన్నారు.

## లండన్‌లో పట్టభద్రుడైన డోకూరి మాదేష్ రెడ్డి



**అభినందించిన తలకొండపల్లి మండల ప్రజలు బంధుమిత్రులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిన డోకూరి మదేష్ రెడ్డి తన కృషి, పట్టుదలతో మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి తనయుడు మాదేష్ రెడ్డి యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్ నగరంలో ఉన్న ప్రముఖ మిడిల్‌సెక్స్ విశ్వవిద్యాలయం నుండి ఆయన విజయవంతంగా డిగ్రీ పట్టాను పొందారు.ఇటీవల విశ్వవిద్యాలయం నిర్వహించిన ఘనమైన పట్టభద్రుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డోకూరి మదేష్ రెడ్డి డిగ్రీ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంప్రదాయ గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యాభ్యాసంలో చూపిన ప్రతిభ, అంకితభావం మరియు నిరంతర శ్రమ ఫలితంగానే ఈ విజయాన్ని సాధించారని కుటుంబ సభ్యులు తెలిపారు. డోకూరి మాదేష్ రెడ్డి సాధించిన ఈ విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పడకల్ గ్రామ ప్రజలు మరియు శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి, స్వగ్రామానికి మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు ఆదర్శంగా నిలిచే ఈ విజయగాథ యువతలో ఉన్నత విద్య పట్ల మరింత ఆసక్తిని పెంపొందిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. డోకూరి మాదేష్ రెడ్డి తన భవిష్యత్ లక్ష్యాలను సాధిస్తూ మరిన్ని విజయాలు అందుకోవాలని మాదేశ్ రెడ్డి తల్లిదండ్రులు డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్టీసీ కండక్టర్ కెంసారపు కోమలకు భారత రాజ్యాంగ పుస్తకం బహుకరణ

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

టీజీఎస్ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కెంసారపు కోమలకు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు ఎస్. వరుణ్ కుమార్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని బహుకరించారు.టీజీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకురాలిగా సేవలందిస్తున్న కెంసారపు కోమల, దళిత, బహుజన, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తూ, దళిత సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఎస్. వరుణ్ కుమార్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెంసారపు కోమలకు భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేసి, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఆచరించాలని ఎస్. వరుణ్ కుమార్ సూచించారు. సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర కార్యదర్శులు దాసరి ప్రభు, దుప్పాడ, అప్పలరాజుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం



**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని లక్ష్మీనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి క్లబ్బుల 2026-27 సంవత్సరానికి సంబంధించిన మూడో ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని లక్ష్మీనగర్ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా లయన్ అనుగం కృష్ణమూర్తి, కార్యదర్శిగా ఆవునూరి శంకర్, కోశాధికారిగా చొక్కారపు వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖనికి అధ్యక్షుడిగా చిట్టిమల్ల కిషోర్, కార్యదర్శిగా అల్లాడి నాగరాజు, కోశాధికారిగా చింతకింది కృష్ణ ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి క్లబ్‌కు అధ్యక్షుడిగా కొమురవెల్లి రాహుల్, కార్యదర్శిగా ఇల్లెందుల శ్రీనివాస్, కోశాధికారిగా దొంతుల గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథి, ఇన్‌స్టాలేషన్ చైర్‌పర్సన్ లయన్ ఉడారి చంద్రమోహన్ (ఎస్‌వీడీజీ-ఈ) నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌లుగా లయన్స్ వొల్లాల హరికృష్ణ, కొల్లూరి ఆనందం, సాదుల వెంకటేశ్వర్లు, మాదరబోయిన భాస్కర్, నార్ల ప్రసాద్, సోమారపు లావణ్య, కొమురవెల్లి సుధాకర్, లక్ష్మీవాణి పాల్గొన్నారు. అలాగే లయన్ సభ్యులు బంక రామస్వామి, కజంపురం రాజేందర్, రేణికుంట చందర్, కట్కూరి శ్రావణ్, గుంత వినోద్, కోదాటి ప్రవీణ్, షేగంటి నరేష్, రత్నాకర్, దొండపాటి మహేందర్ రెడ్డి తదితరులతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, వాసవి, జ్యోతినగర్ ప్రగతి క్లబ్ సభ్యులు హాజరయ్యారు.

# సింగరేణి కార్మికుల 31 డిమాండ్లపై సుదీర్ఘ చర్చలు

**జూలై 10లోపు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: ఏఎల్‌సీ డా. శాశ్వతి రథ్**

**సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మె తప్పదు: ఎఐటీయూసీ హెచ్చరిక**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఎఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సుదీర్ఘ చర్చలు జరిగాయి. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. శాశ్వతి రథ్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కార్మికుల 31 డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు. ఉదయం ప్రారంభమైన చర్చల్లో ఉద్యోగ భద్రత, సంక్షేమ అంశాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అమలు కాని ఒప్పందాలు తదితర అంశాలపై ఎఐటీయూసీ నాయకులు తమ వాదనలు వినిపించారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి ప్రభావాన్ని వివరించగా, యాజమాన్యం తన అభిప్రాయాలను వెల్లడించింది.

ఇరుపక్షాల వాదనలు విన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. శాశ్వతి రథ్, కార్మికుల ప్రధాన డిమాండ్లపై పరస్పర చర్చల ద్వారా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని యాజమాన్యం, గుర్తింపు సంఘానికి సూచించారు. జూలై 10వ తేదీలోపు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అప్పటికీ పరిష్కారం కాని పక్షంలో మరోసారి చర్చలకు పిలుస్తామని స్పష్టం చేశారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే సమ్మె అనివార్యమవుతుందని ఎఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే మరింత ఉధృతమైన పోరాటాలకు సిద్ధమని పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఎఐటీయూసీ తరఫున అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కే. సారయ్య పాల్గొన్నారు. యాజమాన్యం తరఫున ఏజీఎం పర్సనల్ అజయ్ కుమార్ హాజరయ్యారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని గుర్తింపు సంఘం స్పష్టం చేసింది.

# నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ఎస్సీ కమిషన్‌కు సమతా సైనిక్ దళ్ వినతి**

**డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్**




**అగ్నిధార న్యూస్ ,(ములుగు) :**

రాష్ట్రంలోని నేతకాని, మహార్ సామాజిక వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది నేతకాని సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తీవ్ర సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంలో ఉన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీరి సంక్షేమం, ఉపాధి, విద్యా పురోగతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో నేతకాని, మహార్ సామాజిక వర్గాల ప్రత్యేక అస్తిత్వాన్ని పరిరక్షిస్తూ, ఒకే గెజిట్ పరిధిలో కొనసాగిస్తూ ప్రత్యేకంగా గ్రూప్ కేటాయించాలని ఆయన కోరారు. దీని ద్వారా జనాభా నిష్పత్తి ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కుటుంబాలకు భూమి హక్కులు, స్థానిక ఉద్యోగాలు, రాజకీయ రిజర్వేషన్లు ఎస్టీలతో సమానంగా కల్పించాలని డిమాండ్ చేశారు. భూమిపై హక్కులు లేకపోవడం, ఉపాధి అవకాశాల కొరత కారణంగా ఈ వర్గం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వ గెజిట్ రికార్డుల్లో నేతకాని కులాన్ని "మాలసాలె" లేదా "నెత్కాని"గా తప్పుగా పేర్కొనడాన్ని వెంటనే సవరించి, వారి ప్రత్యేక అస్తిత్వానికి తగిన గుర్తింపును కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేతకాని సామాజిక వర్గం సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు ప్రత్యేక ప్యాకేజీలు, సంక్షేమ పథకాలు, నిధులు కేటాయించేలా ఎస్సీ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని డా. మార్షల్ దుర్గం నగేష్ కోరారు. సామాజిక న్యాయ పరిరక్షణలో ఎస్సీ కమిషన్ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాడి కృష్ణ, బసరికారి తిరుమల కుమార్, బుస్సాక రామచందర్, గన్న మహేష్, బాసరీకారి మానస తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్య శాఖ లో కనీస అవగాహనా లేని అధికారులు

**తిమ్మాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రీ ప్రైమరీ సెక్షన్ ను మంజూరు చేయాలి**

**డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఢ డైరెక్టర్ నవీన్ నీకోలాస్ గారికి వినతి పత్రం**

**సర్పంచ్ పోసాన్ పల్లి రాజు**



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ ఎంపీపీ ఎస్ పాఠశాలకు అన్ని అర్హతలు ఉన్న ప్రీ ప్రైమరీ సాంక్షన్ చేసే విషయంలో అధికార నిర్లక్ష్యం ఉందని అలాగే వెంటనే పాఠశాలకు ప్రీ ప్రైమరీ సెక్షన్ ను సాంక్షన్ చేయాలని ఈరోజు డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ఢ డైరెక్టర్ నవీన్ నికోలస్ గారిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోసానిపల్లి రాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విద్య అధికారులు మండల విద్యాధికారులు కనీస అవగాహన లేక ఏ పాఠశాలలో ఏం జరుగుతుందో తెలవకుండా ఆఫీసులకు మాత్రమే పరిమితమై కనీస అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు అన్నారు తిమ్మాపూర్ పాఠశాలలో గత సంవత్సరం యు డేస్ పోర్టల్ లో నమోదు చేసుకొని ఒక ప్రైవేట్ టీచర్ ని పెట్టి యూకేజీ సెక్షన్ ను నడిపించడం జరిగింది . ఆ ప్రయత్నం ఫలితంగా ఈ సంవత్సరం ఒక యూకేజీ లోనే 20 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు పోకుండా తిమ్మాపూర్ ఎంపీపీ ఎస్ పాఠశాలలో చేరడం జరిగింది . ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలలు కాపాడుకోవాలని ఒకపక్క చెబుతూనే అధికారులు వారికి యు డేస్ పోర్టల్ నమోదైన పాఠశాలలకు కాకుండా విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలలకు యు డేస్ పోర్టల్ లో నమోదు కానీ వాటికీ సాంక్షన్ చేయడం అధికారుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థమవుతుంది ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కాకపోవడానికి ప్రధాన కారణం విద్యాశాఖలో పని చేస్తున్న కొంతమంది అవగాహన లేని అధికారులే ప్రధాన కారణం అని అన్నారు. తిమ్మాపూర్ పాఠశాలకు ప్రీ ప్రైమరీ సెక్షన్ ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసినప్పటికీ అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులతో విద్యార్థుల తల్లిదండ్రులతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామ విద్యా కమిటీ అధ్యక్షుడు కొంతం కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, బీసీ గురుకుల టెండర్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

**టీఈపీఏ వ్యవస్థాపకుడు దార మధు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**



పెద్దపల్లి జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని ఎస్సీ, బీసీ గురుకుల వసతి గృహాల టెండర్ల కేటాయింపులో స్థానిక నిరుద్యోగ యువకులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టీఈపీఏ) వ్యవస్థాపకుడు దార మధు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులను పక్కనపెట్టి స్థానికేతరులకు టెండర్లు కేటాయించడం వల్ల జిల్లా యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. గురుకుల వసతి గృహాల సరఫరా వ్యవస్థను సేవా దృక్పథంతో నిర్వహించాల్సి ఉండగా, కొందరు స్వలాభం కోసం వినియోగించుకుంటున్న పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. ఒకే వ్యక్తికి ఐదు, ఆరు, పది, పన్నెండు వరకు టెండర్లు కేటాయించడం వల్ల స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు దక్కడం లేదన్నారు. ఇతర జిల్లాల్లోనూ ఇదే వ్యక్తులకు టెండర్లు కేటాయించినట్లు సమాచారం ఉందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువకులకు ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు టెండర్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే భావన ప్రజల్లో నెలకొన్నదన్నారు. జిల్లా ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి న్యాయం జరిగేలా టెండర్ల కేటాయింపులో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు దార మధు తెలిపారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కు సహకరించాలి



**పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా జూన్ 25, 2026 (గురువారం) నుండి "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య విచ్చేసి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలను సమగ్రంగా పరిశీలించడం, అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడం, జాబితాలోని తప్పులను సరిచేయడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రక్రియకు సహకరించి ఓటరు జాబితా విజయవంతానికి కృషి చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు ఆఫీసర్లు సూపర్వైజర్లుగా వ్యవహరిస్తూ, బూత్ లెవెల్ అధికారులకు నిరంతరం క్షేత్రస్థాయిలో సహకరించాలన్నారు. అర్హులైన ఓటర్ల ఓట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించడం జరగదని, ఓట్ల తొలగింపుపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి అపోహలను, పుకార్లను ప్రజలు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. పెద్దపల్లి తహసిల్దార్ రాజయ్య మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు సమయంలో ప్రతి ఒక్కరి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఈ ప్రక్రియపై బూత్ లెవెల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ అవగాహన శిక్షణా కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, బూత్ లెవల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోలేటి మారుతికి ఘనంగా సన్మానం



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్పూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోలేటి మారుతిని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ఘనంగా సన్మానించారు ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని సొంత ఊరికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదగా కలుసుకుని ఘనంగా సన్మానించడం జరిగింది కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని పార్టీ అభివృద్ధి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయనతో అన్నారు ఆయనతోపాటు సన్మానించిన వారిలో కమాన్పూర్ కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి అప్సర్, మాజీ మైనార్టీ మండల అధ్యక్షుడు జావిద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కడుపు రాజేశం బుర్ర సత్యం తదితరులు పాల్గొన్నారు

## విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వం


**సికింద్రాబాద్ :** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ మండిపడ్డారు. ఇటీవల నీట్ పరీక్షకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీకైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడంలో పూర్తి విఫలమైందని తీవ్ర విమర్శలు చేశారు. నీట్ పరీక్ష రద్దవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్యలకు చేసుకున్నారని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు కట్టి నేర్చుకున్న విద్య పేపర్ లీకేజీతో పూర్తిగా నీరుగారిపోయిందని అన్నారు.. ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో విద్యార్థులలో ఎండగడుతున్నట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది వైద్య విద్యార్థులు రాసి నీట్ పరీక్షకు సంబంధించి పరీక్ష పత్రాలు లీక్ అవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు



## నిజ జీవిత కథతో 'ఇట్స్ లైఫ్ బ్రో'.. ఫస్ట్ లుక్ లాంచ్ చేసిన హీరో నితిన్!

కేఎం అలియాస్ కృష్ణమోహన్, పూజా సుందర్ శెట్టి జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ విడుదలైంది. ప్రామిసింగ్ హీరో నితిన్ ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కృష్ణ మోహన్ సల్లగుండ్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సోమశేఖర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు తెలిపారు. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ భావోద్వేగ ప్రేమకథ అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుందని, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉందని ఆయన అన్నారు. ఈ చిత్రంలో కృష్ణమోహన్, పూజా సుందర్ శెట్టితో పాటు రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే ఇ.రాజయ్య అందించగా, చైతన్య సినిమాటోగ్రఫీ, సాహిత్య సాగర్ సంగీతం, సత్య గిద్దుటూరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.

## డెడ్లీ డాక్టర్‌గా రజనీకాంత్.. 'ధర్మన్' టైటిల్ మేకింగ్ వీడియో విడుదల



అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'ధర్మన్' త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.





## ఓటీటీ నుంచి థియేటర్లలోకి.. 'మిర్జాపూర్ ది మూవీ' టీజర్ విడుదల!


అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై రచ్చ చేయడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

## ఓటీటీలోకి వచ్చేసిన 'అవతార్ 3'.. తెలుగులోనూ స్ట్రీమింగ్!




హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్ అద్భుత సృష్టి, బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన విజువల్ వండర్ "అవతార్: ఫైర్ అండ్ యాష్" (అవతార్ 3) ఎట్టకేలకు ఓటీటీ లోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ వేదికగా ఈ విజువల్ వండర్ బుధవారం సాయంత్రం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రాన్ని ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రేక్షకులు వీక్షించవచ్చు. 'అవతార్' ఫ్రాంచైజీలో వచ్చిన ఈ మూడో భాగంలో దర్శకుడు జేమ్స్ కామెరాన్ సరికొత్త ప్రపంచాన్ని చూపించారు. మొదటి భాగంలో అడవులు, రెండో భాగంలో సముద్ర గర్భాన్ని అన్వేషించిన ఆయన.. ఈ 'ఫైర్ అండ్ యాష్'లో 'యాష్ పీపుల్' (బూడిద తెగ) అనే క్రూరమైన స్వభావం గల సరికొత్త నావి క్లాన్‌ను పరిచయం చేశారు.




## రూ.500 కోట్ల క్లబ్‌కు 'పెద్ది' దూరం..

### 'దేవర' రికార్డును అందుకోలేకపోయిన రామ్ చరణ్ సినిమా

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లను నమోదు చేసి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచింది. అయితే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రూ.500 కోట్ల గ్రాస్ మార్క్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలే అవకాశం కనిపిస్తోంది. 'పెద్ది' విడుదలకు ముందే సోషల్ మీడియాలో రామ్ చరణ్, ఎన్టీఆర్ అభిమానుల మధ్య రికార్డుల చర్చ జోరుగా సాగింది. ముఖ్యంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా సాధించిన వసూళ్లను అధిగమించడమే మెగా అభిమానుల ప్రధాన లక్ష్యంగా మారింది. 'దేవర'కు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడంతో, 'పెద్ది' మరింత భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు ఆశించారు. అయితే విడుదలైన తొలి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.135 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. మొదటి వారంలోనే సినిమా అద్భుతమైన కలెక్షన్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లో అతిపెద్ద సోలో హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం రూ.450 కోట్ల మార్క్ దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ, థియేట్రికల్ రన్ ముగింపు దశకు చేరుకోవడంతో రూ.500 కోట్ల క్లబ్‌లో చేరడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ప్రారంభంలో కొన్ని విమర్శలు ఎదురయ్యాయి. ముఖ్యంగా జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై సోషల్ మీడియాలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే చిత్రబృందం వెంటనే స్పందించి కొన్ని సన్నివేశాల్లో మార్పులు చేయడం, అదనపు సీన్లను జోడించడం ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువైంది. 1990ల విజయనగరం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రవాణా సౌకర్యాలు లేని కొండ ప్రాంత ప్రజల సమస్యల కోసం పోరాడే 'పెద్ది' అనే పాత్రలో రామ్ చరణ్ కనిపించారు. కూలీగా, క్రికెటర్‌గా, రెజ్లర్‌గా మూడు విభిన్న కోణాల్లో కనిపించిన చరణ్ తన శారీరక మార్పులు, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భావోద్వేగ సన్నివేశాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ వాతావరణం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన 'పెద్ది' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం జూలై 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా సినిమా అందుబాటులోకి రానుంది.


Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com